నేడు కరెంటు ఉండని ప్రాంతాలు..

సనత్‌నగర్: ఈఎస్‌ఐ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ కిషోర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు హుడా కాంప్లెక్స్, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు..

సనత్‌నగర్: టమాటా.43, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 50, పచ్చ కాకర 38, పందిరి బీర 38, క్యాబేజీ 15, క్యారెట్ 41, దొండ 40, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 45, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామ గడ్డ 25, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సార కాయ 13, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

12న ఆలయ హుండీల లెక్కింపు

అమీర్‌పేట: శ్రీ శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయం హుండీలను ఆగస్టు 12న లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి నరేందర్‌రెడ్డి తెలిపారు.దేవాదయ శాఖ అధికారులు,ఆలయ ఫౌండర్ ట్రస్టీ, దాతలు,భక్తుల సమక్షంలో లెక్కింపు ఉంటుందని బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు.

బల్కంపేట ఎల్లమ్మకు బోనం సమర్పించిన ఉద్యోగులు



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మకు దేవస్థానం తరపున మారు బోనం సమర్పించారు. శ్రావణ మాసం బుధవారం రోజున గర్భగుడిలో అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.మూల విరాట్‌ను ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు అనిల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాణ అధికారి మహేందర్‌గౌడ్ ,ఛైర్మన్ సాయిబాబాగౌడ్,సూపరింటెండెంట్ హైమావతి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఓయూలో గద్దర్‌కు నివాళి



ఉస్మానియా యూనివర్సిటీ: ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతి సందర్భంగా ఓయూలో విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నినాదాలు చేశారు. అంసా నేత నామ సైదులు టీఎస్‌ఏ రాష్ట్ర నాయకులు ఎస్ఎం శ్రీకాంత్, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నేత అంజి పాల్గొన్నారు.

డాక్టర్ రాంబాబుకు అరుదైన గౌరవం



లాలాపేట: సీఎస్ఐఆర్-ఐఐసీటీ ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ రాంబాబు చేగొండి ప్రతిష్ఠాత్మకమైన కెమికల్ రీసెర్చ్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఆర్ఎస్ఐ) కాంస్య పతకానికి ఎంపికయ్యారు. ఆర్గానిక్ కెమిస్ట్రీలో అసమానమైన ఉత్ప్రేరకానికి రాంబాబు చేసిన గణనీయమైన కృషికి గాను ఈ కాంస్య పతకాన్ని అందుకోనున్నారు. 2026 ఫిబ్రవరి 7న దర్భాంగా యూనివర్సిటీలో జరిగే కార్యక్రమంలో డాక్టర్ రాంబాబుకు కాంస్య పతకాన్ని ప్రదానం చేస్తారు.

ప్రమాణ స్వీకారోత్సవం



విద్యార్థినులకు సైకిల్స్ అందజేస్తున్న దృశ్యం

రసూల్‌పురా: సికింద్రాబాద్ కంటోన్మెంట్ క్లాసిక్ గార్డెన్స్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ పదవ జిల్లా క్యాబినెట్ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అంతర్జాతీయ పూర్వ అధ్యక్షుడు జే. ఫ్రాంక్ మూరే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా డాక్టర్ జి. మహేందర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ మొదటి పౌరురాలుగా జి. దీపారెడ్డితో కలసి ఫ్రాంక్ మూరే పేద విద్యార్థినిలకు సైకిల్స్, ప్రభుత్వ ఆసుపత్రులకు రెండు అంబులెన్స్‌లు అందజేశారు.

రెచ్చిపోయిన సైబర్‌దొంగలు

పెట్టుబడి పేరుతో మోసం
- ఒకేరోజు ఆరు కేసులు నమోదు..
- 5,71,000 కాజేసిన కేటుగాళ్లు



సనత్‌నగర్: పెట్టుబడి పేరుతో ఆన్‌లైన్ మోసగాళ్లు రెచ్చిపోయారు. ఒకేరోజు ఆరు కేసుల్లో ముగ్గురి నుంచి రూ.5,71,000లను కాజేశారు. తక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు పొందవచ్చంటూ ఆకర్షణీయమైన ఆఫర్లు ఇస్తూ అమాయకులను బురిడీ కొట్టించి సొమ్ము చేసుకున్న ఘటనలు సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నాయి. ఒకేరోజు ఆరు కేసులు నమోదు కావడం ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు కలవరపెడుతున్నాయి. వివరాల్లోకి వెళితే..సనత్‌నగర్‌కు చెందిన సౌమ్య (33) మొబైల్ ఫోన్ వాట్సప్‌కు పెట్టుబడి ఆఫర్ సందేశం వచ్చింది. దీంతో ఆమె అవతలి వారు చెప్పినట్లుగా యూపీఐ ద్వారా రూ.50,000లను పంపించింది. అలాగే మరో పెట్టుబడి సందేశానికి ఆకర్షితురాలై రూ.1,30,000లను వివిధ యూపీఐ ఐడీలకు పంపించింది. అయితే ఈ రెండు సంఘటనలకు సంబంధించి డబ్బులు పంపించిన దగ్గర నుంచి అవతలి వ్యక్తుల నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మరో యువకుడి నుంచి రూ.2,25,000

సనత్‌నగర్‌కు చెందిన నిఖిల్ (27) తన టెలిగ్రామ్ యాప్‌లో పెట్టుబడి ఆఫర్‌ను అందుకున్నాడు. ఇందులో వారు ఐపీఓలో కొన్ని అధిక రాబడి స్కీములు ఉన్నాయని చూపించారు. ఆపై లాభాలను పొందడానికి కొంతమొత్తాన్ని పెట్టుబడి పెట్టమని సూచించారు. దీంతో నిఖిల్ వారిని నమ్మి రూ.1,45,000లను పంపించాడు. మరో కేసుకు సంబంధించి నిఖిల్ ఇదే విధమైన పెట్టుబడి ఆఫర్‌ను అందుకుని రూ.80,000 యూపీఐ ద్వారా పంపించాడు. ఆ తర్వాత అతను సంపాదించిన లాభాన్ని పొందేందుకు మరికొంత మొత్తాన్ని పెట్టుబడి పెట్టమని అడిగారు. దీంతో తాను రూ.2,25,000లు మోసపోయానంటూ సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు.

మరో బాధితుడి నుంచి రూ.1,66,000

సనత్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్ (42) మొబైల్ ఫోన్ వాట్సప్‌కు వచ్చిన పెట్టుబడి ఆఫర్‌ను నమ్మి రూ.1.36,000లను పంపించాడు. అదే బాధితుడు మరో కేసులో రూ.30,000లు పెట్టుబడి మోసానికి గురయ్యాడు. మొత్తం రూ.1,66,000లు నష్టపోయానంటూ బాధితుడు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయా కేసులను సనత్‌నగర్ పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సార్.. యాదిలో లేరు ...



పూలమాలకు కూడా నోచుకోని 'గాంధీ'లోని జయశంకర్ విగ్రహం

గాంధీఆస్పత్రి: తెలంగాణ మలిదశ ఉద్యమానికి దిశానిర్దేశకుడు.. తెలంగాణ ప్రజలకు జాతిపిత ఆచార్య జయశంకర్ సార్. తెలంగాణ సమాజం యావత్తు ఆయన జయంతిని ఓ పండుగలా జరుపుకుంటే.. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలోని ఆయన విగ్రహానికి పూలదండ వేసేవారే లేకపోవడం దురదృష్టకరం. తెలంగాణ రాష్ట్ర సాధనలో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి వైద్యుల పాత్ర మరువలేనిది. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) గాంధీ యూనిట్ ప్రతినిధులు జయశంకర్ విగ్రహాన్ని గాంధీ ఆస్పత్రి ప్రధాన భవనం గేట్ ఎంట్రెన్స్‌లో 2014లో ఏర్పాటు చేయగా, అప్పటి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రారంభించారు. అప్పటి నుంచి ఆయన జయంతి, వర్ధంతి ఇతర ప్రాముఖ్యమైన రోజుల్లో ఆస్పత్రి పాలనా యంత్రాంగం, టీజీజీడీఏ సంఘ ప్రతినిధులు జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించేవారు. ప్రస్తుతం శిలాఫలకం బీటలు వారింది. విగ్రహం చుట్టూ షాబాద్‌బండలు పాడైపోయి నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారాయి. ఆచార్యుని జయంతి రోజును కూడా ఆయనను విస్మరించడం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.303 కోట్లతో అభివృద్ధి పనులు



భూగర్భ డ్రైనేజీ లైను పనులు ప్రారంభిస్తున్న బోర్డు సభ్యురాలు భానుక నర్మద

కంటోన్మెంట్: త్వరలో కంటోన్మెంట్‌లో గతంలో లేని రీతిలో అభివృద్ధి జరగనుందని బోర్డు సభ్యురాలు భానుక నర్మద అన్నారు. రూ.10 లక్షల బోర్డు నిధులతో ఆరోవార్డు కుమ్మరిగుట్టలోని తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం నుంచి టెంపుల్‌రాక్ ఎన్‌క్లేవ్ వరకు నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భానుక నర్మద మాట్లాడుతూ ఎలివేటెడ్ కారిడార్ పరిహారం సొమ్ము రూ.303 కోట్లతో నాలాల ఆధునీకరణ, డ్రైనేజీ లైన్‌ల నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. దీంతో కంటోన్మెంట్ చరిత్రలో కనీవినీ ఎరుగని స్థాయిలో అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిజెపి వార్డ్ అధ్యక్షులు ప్రతీక్ జైన్, కాలనీ వాసులు మురుగేషన్, శ్రవణ్ కుమార్, రవీందర్ రెడ్డి, బాణాల శ్రీనివాస్ రెడ్డి, ఉమేష్, జైరాం, సంతోష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్లకు కేంద్రంపై ఒత్తిడి పెంచండి



మాట్లాడుతున్న బారి అశోక్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు కోసం కాంగ్రెస్ పార్టీ నేతలు కేంద్రం పై ఒత్తిడి పెంచాలని టీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో ధర్నాకు వెళ్లిన కాంగ్రెస్ నేతలు, ఎంపీలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, 9వ షెడ్యూల్‌లో చేర్పించిన తర్వాతే తెలంగాణకు రావాలని లేదంటే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎస్‌పీ నేతలు నూకల మధు, మహేష్, విక్రమ్, గణేష్, నరేష్, రాము, పవన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సైన్స్ కాలేజీ వార్షికోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.జి ప్రభాకర్ అధ్యక్షత వహించగా వీసీ ప్రొ.కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక అతిథిగా హాజరైన సినీ నటుడు ప్రదీప్, ఈస్ట్ జోన్ డీసీపీ డా.బాలస్వామి, డీన్ ప్రొ. కరుణసాగర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్

అడ్డగుట్ట: తుకారంగేట్ కమలమ్మ వృద్ధాశ్రమం సమీపంలో మహంకాళి అమ్మవారి అలయంలో నిర్వహించిన నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్ బుధవారం హాజరయ్యారు కార్పొరేటర్ పూజ కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. లింగాని శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

వెంగళరావునగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి మధురానగర్ పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా యూసుఫ్‌గూడ గడ్డ వద్ద పడి ఉన్న వృద్ధుడిని గుర్తించి అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం

సినీ నటుడు రాజీవ్ కనకాల

రాంగోపాల్‌పేట్: మంచి ఆరోగ్యం కోసం వ్యాయామం ఎంతో అవసరమని సినీ నటుడు రాజీవ్ కనకాల అన్నారు. బుధవారం బేగంపేట కిమ్స్-సన్‌షైన్ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్డులోని సంజీవయ్య పార్కులో నేషనల్ వాస్కులర్ డే సందర్భంగా వాస్కులర్ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వాస్కులర్ సమస్యలతో చేతులు, కాళ్లు తీసేయాల్సిన పరిస్థితులు వస్తున్నాయని ఇటీవల తమ బంధువుకు ఇలాంటి పరిస్థితి వచ్చిందని గుర్తు చేశారు. అందుకే ప్రతి ఒక్కరూ వ్యాయామం దిన చర్యలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. డాక్టర్ నిషాన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది వాస్కులర్ సమస్యలతో సుమారు 25వేల మంది చేతులు, కాళ్లు కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీవోవో సుధాకర్ జాదవ్, డాక్టర్ సీహెచ్ గోపాల్, డాక్టర్ నివేదిత, డాక్టర్ నవవికాస్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ రామాలయం వద్ద దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, సుగర్‌తోపాటు పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. డీబీఎఫ్ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవ, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ ప్రతినిధులు శారద, లక్ష్మీ, మాధవి, పద్మ, ల్యాబ్ టెక్నీషియన్లు నిఖిల్, అమర్ తదితరులు పాల్గొన్నారు.



డీబీఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

నీటి సమస్యకు పరిష్కారం



పైప్‌లైన్ పనులు చేపట్టిన జలమండలి అధికారులు

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో నెలకొన్న ఉన్న మంచినీటి సమస్యను అధికారులు పరిష్కరించారని బంజారావెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అన్నారు.కొన్ని చోట్ల గత కొంత కాలంగా సమస్య ఉందని, దీనిని ఇటీవల జలమండలి జీఎం,డీజీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు అసోసియేషన్ అధ్యక్షులు హరిసింగ్‌జాదవ్ తెలిపారు.వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో సమస్యకు గల కారణాలను గుర్తించి కొత్తగా పైప్‌లైన్ పనులు చేపట్టారని అన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే శ్రీగణేష్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

రసూల్‌పురా: సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో కంటోన్మెంట్ నియోజక వర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ జన్మదిన వేడుకలు బుధవారం రసూల్‌పురాలో జరిగాయి. కాంగ్రెస్ పార్టీ రెండవ వార్డు అధ్యక్షుడు శాంసన్ రాజు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. కాంతయ్య. బాలమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో యోగా శిక్షణ..



బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మహిళాభివృద్ధి, విస్తరణ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం సమగ్ర మహిళల ఆరోగ్యం కోసం 'మానసిక, శారీరక ఆరోగ్యం -యోగా ఆవశ్యకత' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి మాట్లాడుతూ మహిళలు వేళకు ఆహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని దూరం చేయవచ్చన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి, యోగాచార్య బ్రహ్మకుమారి లక్ష్మీ, బీకే బిందు మహిళా ఉద్యోగులు, విద్యార్థినులకు యోగా ఆవశ్యకతను వివరించారు. పనిచేసే కార్యాలయాల్లో ఒత్తిడి ఎలా అధిగమించాలో వివరించారు. విశ్వవిద్యాలయ మహిళాభివృద్ధి, విస్తరణ కేంద్రం ఇన్‌ఛార్జి ప్రొఫెసర్ కే రాణి రజితా మాధురి తమ విభాగం ద్వారా మహిళలకు అనేక అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

'ఆగస్టు 15 లోగా న్యాయం చేయకుంటే ఆమరణ దీక్షలు'

హిమాయత్‌నగర్: డీఎస్సీ-2024 ఎస్‌జీటీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు ఈ ఆగస్టు 15 లోగా న్యాయం చేయాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నాయకులు జనార్దన్, ఇంద్ర నాయక్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామన్నారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అభ్యర్థులు అస్మా, నవీన్, రాచకొండ రమేష్ లతో కలిసి వారు మాట్లాడారు. జీవో నెం.74 ప్రకారం గత నోటిఫికేషన్‌లో 100 పోస్టులను కేటాయించి కేవలం 33 మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. అయితే ఈ నియామకాల్లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. దీనిపై తాము పోరాటం చేయగా రీ వెరిఫికేషన్ చేసి అర్హులను న్యాయం చేస్తామని హామీ ఇచ్చి తొమ్మిది నెలలు గడిచినా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించాలి



ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

అమీర్‌పేట: 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు మద్దత్తుగా అమీర్‌పేట డివిజన్ సత్యంథియేటర్ చౌరస్తాలో బుధవారం ధర్నా చేశారు. బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే బీజేపీ ప్రభుత్వం వెంటనే బిల్లుకు ఆమోదం తెలపాలని,లేని పక్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెపుతారని నాయకులు హెచ్చరించారు. ధర్నాలో కాంగ్రెస్ పార్టీ అమీర్‌పేట డివిజన్ అధ్యక్షులు ఎస్.ఎస్.రావు,శంకర్ యాదవ్, కటకం భాస్కర్ పాల్గొన్నారు.

ఫతేనగర్ బ్రిడ్జిపై మొరాయించిన ట్రాలీ



ఫతేనగర్ బ్రిడ్జిపై నిలిచిపోయిన ట్రాలీ వ్యాన్

సనత్‌నగర్: ఫతేనగర్ బ్రిడ్జిపై బుధవారం సాయంత్రం ఓ మినీ ట్రాలీ వ్యాన్ మొరాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. బల్కంపేట నుంచి ఫతేనగర్ వైపు వెళ్తున్న ట్రాలీ వ్యాన్ బ్రిడ్జి మధ్యలో నిలిచిపోవడంతో వెనుక వచ్చిన వాహనాలన్నీ బారులుదీరాయి. ఇరుకైన ఈ బ్రిడ్జిపై ఒక వాహనం దాటి మరో వాహనం వెళ్లే వీలులేకపోవడంతో బల్కంపేట వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ప్రభావం మరో పక్కన ఫతేనగర్ మార్గంపై కూడా పడింది.దాదాపు రెండు గంటల పాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు నిలిచిపోయిన వాహనాన్ని అక్కడి నుంచి తరలించారు.

ప్రొ.జయశంకర్‌కు ఘన నివాళి

తెలంగాణ ఉద్యమ దార్శనికుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా పురస్కరించుకుని సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ప్రజల్లో ఉద్యమ భావజాలాన్ని రగిల్చారని కొనియాడారు. జయశంకర్ స్ఫూర్తితో ఉద్యమాన్ని కొనసాగించి సాహసోపేత పోరాటం చేసి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని పలువురు పేర్కొన్నారు.



జయశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్



ఉస్మానియా యూనివర్సిటీలో..



బోయిగూడలో కార్పొరేటర్ కె. హేమలత, రాజేందర్ తదితరులు



లాలాపేటలో..



నివాళులు అర్పిస్తున్న టీజీపీఎస్సీ ఉద్యోగులు, సిబ్బంది

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379